క్లుప్తంగా

సీఐగా వరప్రసాద్ బాధ్యతల స్వీకరణ



గూడెంకొత్తవీధి: గూడెం కొత్తవీధి సీఐగా వి.వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐ పని చేసిన సీఐ అశోక్‌కుమార్‌ను అనకాపల్లికి బదిలీ చేశారు. అతని స్థానంలో విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న వరప్రసాద్‌ను నియమించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. గంజాయి నిర్మూలనపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తామన్నారు. గంజాయి ఇతరత్రా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను గిరిజన యువతకు వివరిస్తామని చెప్పారు.

నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

గూడెంకొత్తవీధి: మండలంలోని గూడెం పంచాయతీ వెదురుపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, అట్టలను దాత దుమంతి సత్యనారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అత్యంత బలమైన ఆయుధం విద్య అని అన్నారు. విద్యతోనే సమాజాన్ని మార్చవచ్చన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలన్నారు. రెవెన్యూ ఉద్యోగి అయిన సత్యనారాయణ చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు కొనియాడారు. స్థానికులు ధారబాబు, చెల్లయమ్మ, శాంతరాజు, భవాని పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీడీపీవో విజయకుమారి, సూపర్‌వైజర్లు

కొయ్యూరు: పిల్లల బరువు, ఎత్తుల కొలతలపై అంగన్‌వాడీ వర్కర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. ఆమె కార్యాలయంలో శుక్రవారం బరువు, ఎత్తుల కొలతలను తీసే అంశంపై అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అనంతరం పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రతీ నెల విధిగా కొలతలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. గంజాయి, సారా ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.


ఘనంగా కార్తీక వనసమారాధన



కార్తీకసమారాధనలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిరిడీసాయిబాబా వారి ఆలయప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక వనసమారాధన సందడిగా జరిగింది. ఆలయప్రాంగణంలోని రావి చెట్టు, ఉసిరి చెట్లకు పసుపు కుంకుమలు, నేవేద్యం సమర్పించి, కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అక్కడే వంటలు చేసుకొని ఉసిరి చెట్టు కింద సహపంక్తి భోజనాలు చేశారు.

కన్నంపేటలో ఇల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

కొయ్యూరు: మండలంలోని ఆడాకుల పంచాయతీ కన్నంపేటకు చెందిన ఇరటా సోములమ్మ పూరిల్లు శుక్రవారం ఉదయం అగ్నికి ఆహుతైంది. దీంతో ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

దారుణ దారులు

- అసంపూర్తిగా శంకుపార్తి రోడ్డు పనులు
- గోతులతో సతమతం
- వర్షం పడితే చిత్తడిగా మారుతున్న రహదారులు
- గ్రామస్తుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



రవాణా సదుపాయం లేక కాలినడకన వెళ్తున్న గ్రామస్తులు



శంకుపర్తి-గాలిపాడు రహదారి దుస్థితి

అనంతగిరి(అరకులోయ రూరల్): అధ్వాన దారులతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో గుమ్మకోట పంచాయతీ శంకుపార్తి, గాలిపాడు గ్రామల రహదారులు దారుణంగా ఉన్నాయి. ఎనిమిదేళ్ల క్రితం గుమ్మకోట పంచాయతీ కేంద్రం నుంచి శంకుపార్తి, గాలిపాడు గ్రామాల రహదారి కోసం సుమారు రూ.6కోట్లతో రోడ్డు పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ పనులు వరదిలేయడంతో నాటి నుంచి నేటి వరకు దారి అధ్వానంగా మారింది. ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పూర్తిగా అటవీ ప్రాంతం కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారింది. అధికారులు, పాలకులనిర్లక్ష్యం కారణంగా రహదారి పనులు పునఃప్రారంభానికి నోచుకోవడం లేదు. అసంపూర్తిగా పనులు నిలిచిపోవడంతో రవాణా సౌకర్యం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యసర సమయాల్లో 104, 108 సేవలు అందని పరిస్థితి నెలకొంది. రోగులకు డోలీమోతలే శరణ్యంగా మారాయి. కాలినడకనే ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటివరకు అధికారులు ఈ రహదారిని పరిశీలించిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం : రహదారి సౌకార్యం లేక శివారు గ్రామాలైన శంకుపార్తి, గాలిపాడుతో పాటు వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు, నివాస గృహాలు నిర్మించేందుకు అవకాశం లేకుండా పోతోంది. సరైన దారి లేక భవన నిర్మాణ సామగ్రి తీసుకొచ్చేందుకు ఆస్కారం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో బోర్లు లేక ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నారు. కలుషిత నీటి వినియోగంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. గ్రామానికి రహదారి నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి



కొండకోనల్లోనే దశబ్దాల తరబడి జీవనం సాగిస్తున్నాం. రహదారి సౌకార్యం లేక గ్రామాల్లో అభివృద్ధి కొరవడింది. గ్రామంలో అనారోగ్యం బారిన పడితే డోలీ మోతలే దిక్కు. అధికారులు దృష్టి సారించి గ్రామంలో రహదారి నిర్మించాలి. వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలి.

-ముఖి లక్ష్మి, గాలిపాడు, గుమ్మకోట పంచాయతీ, అనంతగిరి మండలం

అధికారులు పట్టించుకోవడం లేదు



మన్యంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నా.. మా గ్రామానికి కనీస అభివృద్ధి కొరవడింది. రహదారి లేక నానా అవస్థలు పడుతున్నాం. కాలినడకే శరణ్యంగా మారింది. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దుర్భర జీవితాలను అనుభవిస్తున్నాం.

- రామకృష్ణ, గుమ్మకోట పంచాయితీ, అనంతగిరి మండలం

త్వరలో పనులు ప్రారంభిస్తాం

గుమ్మకోట, శంకుపర్తి గ్రామాల్లోని రోడ్డు పనులకు అటవీశాఖ ఆంక్షలతో పనులకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- రవికుమార్, పంచాయతీరాజ్ డీఈ, అరకులోయ డివిజన్

నిత్యావసర సరకుల పంపిణీ



పాడేరులో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



పొగరాని పొయ్యిలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాధవరావు

సాక్షి,పాడేరు: పట్టణంలోని గుడివాడ కాలనీలో ఉన్న పేద కుటుంబాలకు నిత్యావసర సరకులను నవజీవన్ ఆనాథ ఆశ్రమం ప్రతినిధులు శుక్రవారం పంపిణీ చేశారు. తిరుపతి నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.శ్రీధర్ ఆచార్య ప్రతి నెల 2వ శుక్రవారం పేద ఒంటరి మహిళలకు సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మేనేజర్ సద్దు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ చిట్రాయిపుట్టు గ్రామంలో క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సమకూర్చిన పొగరాయి పొయ్యిలను సర్పంచ్ పలాసి మాధవరావు, మండల కో–ఆర్డినేటర్ చెండా ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.వీటిని సద్వినియోగంలో చేసుకోవాలని వారు కోరారు. గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులకు ఉచితంగా అల్పాహారం, భోజన సదుపాయాన్ని దాత నక్కా జ్ఞానేశ్వరరావు సమకూర్చినట్టు స్థానికులు తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మి

గంగవరం : మండలంలోని బాల్య వివాహాలు అరికట్టేందుకు మండల స్థాయి బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులు కృషి చేయాలని సీడీపీవో సీహెచ్.లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై మండల స్థాయి బాల్యవివాహాల నిరోధక కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఆమె శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి, వెలుగు సీసీ మోహనలక్ష్మి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామన్న,నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ రామన్న ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రామన్న మాట్లాడుతూ అమలుచేయని హామీలతో కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఒక్క పథకం అమలుచేయలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, నాయకులు నర్సింహమూర్తి, రామ్మూర్తి పాల్గొన్నారు.


ఎన్‌సీసీ యూనిట్ కోసం వినతి



ఎంపీ తనూజరాణికి వినతిపత్రాన్ని ఇస్తున్న లైబ్రేరియన్ జగత్‌రాయ్

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అరుకు ఎంపీ తనూజరాణికి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు కళాశాల లైబ్రేరియన్ జగత్ రాయ్ శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఏ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ లే పోవడంతో గిరిజన విద్యార్థులకు శిక్షణ లేకపోవడంతో పోలీసు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సు తదితర ఉద్యోగాల్లో ఉపాధి పొందే అవకాశాలు లేకుండా పోతుందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.


నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి: ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని గాలికొండ ఎంపీటీసీ బుజ్జి బాబు శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మండల సమావేశంలో నిధుల దుర్వినియోగంపై వివరాలు అడిగితే అధికారులు సమాచారం ఇవ్వడం లేదని ఆయన చెప్పారు. దీనిపై యంత్రాంగం సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శిథిల స్తంభాలను మార్చాలి



పాడైన స్తంభాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ మోస్య

అనంతగిరి(అరకులోయ రూరల్): టోకూరు పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో సర్పంచ్ కిల్లో మోస్య శుక్రవారం పర్యటించారు. రహదారులు, పాడైన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడై శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాడైన విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలను ఏర్పాటుచేయాలని కోరారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

సీలేరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, వాటి వలన జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దేవినాగ్

ఎటపాక: గౌరిదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం,తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ దేవినాగ్ వివరించారు. రోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్‌వీ లక్ష్మి,"ఎసిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

ఎటపాక: కృష్ణవరంలోని అచ్యుతాపురంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో రాబిన్ సుదర్శన్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.వీఏఏ భార్గవి, ఏపీసీఎస్‌ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జి వెంకట్, ఎంపీటీసీ రాజు పాల్గొన్నారు.

గంగవరం: పిడతమామిడిలో ఆయిల్‌పామ్ సాగు, బిందు సేద్యంపై రైతులకు పతంజలి ఫుడ్స్ ప్రతినిధి శ్రీనివాస్, ఉద్యానవన డ్రిప్ ఇరిగేషన్ కోఆర్డినేటర్ వెంకటరమణ అవగాహన కల్పించారు.

నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంలో అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ నూరుశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలని కోరారు. అక్షరాస్యులైతే కుటుంబమంతా చదువుతుందన్నారు. సీడీపీవో విజయకుమారి, ఏపీఎం సాధన, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అనంతగిరి(అరకులోయ రూరల్): శివలింగపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో మండల యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు మాట్లాడుతూ 17న అరకులో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సింహాచలం, రాంబాబు, కొండబాబు,నాగేశ్వరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ భీముడువలస గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, అని గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామన్నారు. తమ గ్రామానికి రహదారి కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి రహదారి అందుబాటులో రానుండడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, వైఎస్సార్‌సీపీ సీనియర్ కె.అశోక్‌కుమార్, ఎం.సాంబ, రాజ్‌కుమార్, సుంద్ర పాల్గొన్నారు.

చవటపాడులో తాగునీటి సమస్యకు పరిష్కారం



చవటపాడులో కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ లలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతపల్లి: మండలంలోని చవటపాడు గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటుచేసిన కుళాయిలను చౌడుపల్లి సర్పంచ్ కొర్రా లలిత తదితరులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికులు తాగునీటి కుళాయిలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవడంతో స్థానికులు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సింహాచలం, కరుణానిధి, రాజారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి



బొర్రతాడిలో పాదయాత్రలో భీమిలి సద్గురు సేవా ఆశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ తదితరులు

జి.మాడుగుల: మండలంలోని పెదలోచలి పంచాయతీ బొర్రతాడి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రచార జిల్లా ప్రముఖు అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గాంధీనగరం పంచముఖ ఆంజనేయస్వామి సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో దేవాలయాలు నిర్మించుకోవాలని, ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని కోరారు. వెంకటరమణ, అప్పలనాయుడు, గంగాధర్‌రావు, భీమన్న పాల్గొన్నారు.

నేడు రిసార్ట్ నిర్వాహకులతో సమావేశం

చింతపల్లి: మండలంలోని లంబసింగిలో రిసార్టుల నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ వెంకవేశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాజంగి, లంబసింగి, పెదబరడ పంచాయతీల పరిధిలో గల రిసార్టుల వద్ద ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి విధిగా రిసార్టుల నిర్వాహకులందరూ హాజరుకావాన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో 104 సంఘం అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బందికి ప్రభుత్వం మూడు నెలలుగా వేతనాలు అందజేయకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. 104 సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం సిబ్బందికి అందజేశారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు

గంగవరం : గ్రామాల్లో ప్రతీ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలకు, ఫోన్ నంబర్లుకు లింక్ చేయడంలో ఆధార్ మంజూరులో గ్రామ సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి బ్యాంక్ ఖాతాలు, ఫోన్ నంబర్లుకు ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నీతి అయోగ్ డివిజన్ ప్రతినిధి చంద్రకళ, మండల ప్రతినిధి హేమామాధురి, సీడీపీవో లక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

హుకుంపేట: మండలంలోని శోభకోట పంచాయతీ సంపంగిపుట్టు గ్రామానికి చెందిన ఎంపీపీ కూడా రాజుబాబు సహోదరుడు కూడా బాబూరావు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ సంపంగిపుట్టు గ్రామానికి స్థానిక నాయకులతో చేరుకొని మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు పెదబయలు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్, నాయకులు విశ్వేశ్వరరావు తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

డుంబ్రిగుడ: సీపీఎం మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో కమిటీ ప్రధాన కార్యదర్శిగా పోతురాజుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



మహిళా రైతులకు వ్యవసాయ కిట్లను అందజేస్తున్న ఐఎఫ్‌పీవో డీఎం చిరంజీవినాయుడు తదితరులు

సాక్షి,పాడేరు: గిరిజన మహిళా రైతులు ఆర్థికాభివృద్ధికి ప్రోత్సహిస్తున్నామని, సమగ్ర రైతు సహకార సంస్థ(ఐఎఫ్‌సీవో) డీఎం చిరంజీవినాయుడు చెప్పారు.మహిళా రైతులకు వ్యవసాయ అభివృద్ధి, మార్కెటింగ్ తదితర ఆంశాలపై స్థానిక గిరిజన ఉద్యోగుల భవనంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా రైతులకు వ్యవసాయ కిట్లు పంపిణీ చేశారు. విజయ్‌కుమార్, కుమారస్వామి, శ్రీనివాసరావు, చినతల్లి, శిరీషా,రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు

గంగవరం : మండలంలోని పచ్చదనం - పరిశుభ్రతపై ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామసచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని, శ్రమదాన కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని ఎంపీడీవో పిజి.రామకృష్ణ అన్నారు. గంగవరంలో సంత వీధిలో వారపు సంత నిర్వహించే స్థలంలో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానంతో సిబ్బంది చెత్తను తొలగించారు. ఏపీఎం షణ్ముఖరావు, ఈవోపీఆర్డీ నరసింగరావు, ఏవో సిద్ధేశ్వరరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని అమ్మిరేఖల, బడదనాంపల్లి, రాజవొమ్మంగి గ్రామాల్లో ప్రభుత్వ అధికారుల నేతృత్వంలో శ్రమదానం కార్యక్రమం శుక్రవారం జరిగింది. వీధుల్లో పిచ్చిమొక్కలు తొలగించి చెత్త చెదారం ఏరి దూరంగా డంప్ చేశారు. ఎంపీడీఓ. ఎల్.యాదగిరీశ్వరరావు ప్రజలకు అవగాహన కల్పిస్తు గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో మత్స్యగెడ్డ ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లి ఆలయ గర్భగుడి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుజనకోట గ్రామ ఉద్యోగుల సంఘం, దాతల సహకారంతో గర్భగుడి నిర్మాణానికి సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మీ, గ్రామ పెద్దలు శంకర్‌రావు, నీలకంఠం, ధర్మారావు, గణపతి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



రాజేంద్రపాలెంలో భిక్షాటన చేస్తున్న వీవోఏలు

డుంబ్రిగుడ/కొయ్యూరు/చింతపల్లి/జి.మాడుగుల: మూడేళ్ల కాలపరిమితి సర్క్యూలర్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వీవోఏలు చేపడుతున్న దీక్షలు శుక్రవారం నాడు మూడు రోజులకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వీవోఏలు రాస్తా రోకోలు, ఆందోళనలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కొయ్యూరులోని రాజేంద్రపాలెంలో వీవోఏలు భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.